క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొల్లాపల్లి మండలం గండిగనుమల పైతండాకు చెందిన టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

నేడు సాతులూరులో జగనన్న సురక్ష

నాదెండ్ల: సాతులూరు 1వ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష పథకంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు మండల జగనన్న సురక్ష కన్వీనర్ బి.రవికుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీపై దాడి

వినుకొండ (నూజెండ్ల): మండల పరిధిలోని పువ్వనూతల పంచాయతీ పరిధిలోని రాముడుపాలెం తండాకు చెందిన ఎంపీటీసీ కె.కోటమ్మబాయిపై ఇరువురు మహిళలు దాడి చేశారు. ఐనవో లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కోటమ్మబాయి అత్త దానిబాయి, ఆడపడుచు సరోజినిబాయిలు దాడి చేశారు. ఇటీవల ఎంపీటీసీ భర్త బాలాజీ నాయక్ మృతిచెందడంతో ఆస్తి విషయమై ఆమెపై దాడి చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి వృద్ధుడి దుర్మరణం



వినుకొండ టౌన్: కదులుతున్న రైలు ఎక్కుతు ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జి.ఆర్.పి ఎస్ఐ సుబ్బారావు కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పెద్ద రావిపాడు గ్రామానికి చెందిన తాతపూడి శాంసన్ (60) కదులుతున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడటంతో, కాళ్లకు బలమైన గాయాలయ్యాయన్నారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలోనున్న శాంసన్‌ను చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గం మధ్యంలో మృతి చెందాడన్నారు.

ప్రభుత్వ సహకారం అభినందనీయం

శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడటం అభినందనీయమని వినుకొండ నియోజకవర్గ చర్మకారుల సంఘం అధ్యక్షులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు మల్లావరపు రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పోట్లూరు గ్రామం హరిజన కాలనీలో మాదిగ చర్మకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన మాదిగ చర్మకారులు, డప్పు కళాకారులకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ సదస్సులో మండల చర్మకారుల సంఘం అధ్యక్షులు జుంజు యేహాను, కుంపటి రత్తయ్య, మోషే, నంబూరి పెద్దయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి బానిసైన వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించటంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుభానినగర్‌కు చెందిన షేక్ యూసుఫ్(25) కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. గత కొంతకాలంగా పనికి వెళ్లకుండా నిత్యం మద్యం తాగి తిరుగుతుండంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన యూసుఫ్ ఇంటి సమీపంలో గత నెల 30వ తేదీన ఎలుకల పేస్టు తిన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులుప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాసిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో..



నరసరావుపేట ఈస్ట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ, మొక్కల పెంపకం చేపట్టాలని జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రయ్య తెలిపారు. సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ రూపొందించిన పర్యావరణ హిత సంచులను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. నేటి అవసరాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచుల వలన పర్యావరణం దారుణంగా దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బుల్లిబాబు, సభ్యులు తోట సురేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. సర్వ జనరక్ష

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- వేర్వేరు ప్రాంతాల్లో హాజరైన ఎమ్మెల్యేలు
- లబ్ధిదార్లకు రేషన్‌కార్డులు, ఇళ్లపట్టాలు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



నరసరావుపేటలో లబ్ధిదార్లకు కార్డులు, ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రజలకు ఏది అవసరమో ప్రభుత్వం ముందుగానే గుర్తించి వారి ఇంటి ముంగిటకే వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పట్టణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన మూడు, 11వ వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మూడో వార్డులో సంక్షేమ పథకాలు ద్వారా రూ. 5.83 కోట్లు లబ్ధిదారులకు అందజేయగా, రూ.55 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే 11వ వార్డులో రూ.5.73 కోట్లు సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేయగా, రూ.70 లక్షల అభివృద్ధి పనులు చేశామన్నారు. జగనన్న పాలనలో ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకుంటున్న జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కోరారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటినీ సందర్శించి వారికి అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుని ఆ రోజే అందించడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకం సర్టిఫికెట్ లేకపోవడం వల్ల దాన్ని పొందలేకపోతున్నామని అనుకున్న వాళ్లకి వెంటనే దరఖాస్తు చేస్తే ఆ సర్టిఫికెట్ అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎంతో నిజాయితీగా, పారదర్శకమైన పాలన అందిస్తున్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా ఆయా వార్డుల్లో దరఖాస్తు చేసిన లబ్ధిదార్లకు రేషన్‌కార్డులు, ఇళ్లపట్టాలు, కుల, ఆదాయం లాంటి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, టీపీవో రామ్మోహనరావు, వార్డు ఇన్‌చార్జ్‌లు సయ్యద్ ఖాజా మొహిద్దీన్, సానికొమ్ము రమణారెడ్డి, వార్డు నాయకులు షేక్ శిలార్, కామిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, దుగ్గెంపూడి వేమారెడ్డి, హిదాయత్‌ఖాన్, ఎస్.తిప్పరయ్య, అంగలూరి ఏడుకొండలు, కొమ్మసాని కమలాకరరెడ్డి పాల్గొన్నారు.

పెదకంచర్లలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలువురు అధికారులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం నెలరోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, గ్రామస్తులు తమ వలంటీర్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌చంద్, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మండలంలోని బొమ్మరాజుపల్లి, అంగలూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. బొమ్మరాజుపల్లిలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో, అంగలూరులో ఎంపీడీవో రంగనాయకులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మరాజుపల్లిలో 125, అంగలూరులో 112 సర్టిఫికెట్లను జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, దీనిద్వారా అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

లింగారావుపాలెంలో జగనన్న సురక్ష గ్రామసభ

యడ్లపాడు: అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలను అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని అధికారులు తెలిపారు. మండలంలోని లింగారావుపాలెంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామసభను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామం పరిధిలో ఇంటింటికి తిరిగి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సందర్శించారని తెలిపారు. మండలస్థాయి అధికారులు రెండు బృందాలుగా సదరు సర్వేను పర్యవేక్షించాయన్నారు. ఇంటింటి సదర్శనలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, పథకాలు అందని వారి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేసి వారికి టోకెన్ నంబర్లు ఇచ్చామన్నారు. సచివాలయ పరిధిలో మొత్తం 181 సర్వీసులు నమోదు అయ్యాయని, వాటిలో 157 సర్వీసులను తక్షణమే పరిష్కరించామన్నారు. అనంతరం 42 ఆధార్, 105 ఆదాయ, కుల, రేషన్ కార్డులు, మరో 32 కౌలురైతు గుర్తింపు కార్డులను వేదికపైనే ప్రజలకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు షేక్ కరీమూన్, గౌరు లక్ష్మయ్య, ఎంపీటీసీ వీరరాఘవులు, సచివాలయ మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, గ్రామ కన్వీనర్ ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, ఏవో సాయి శ్రీనివాస్, ఈవోపీఆర్డీ బృందావనం వరూధిని, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

నరసరావుపేట రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆర్డీఓ శేషిరెడ్డి తెలిపారు. మండలంలోని దొండపాడులో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషిరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నట్టు తెలిపారు. గ్రామ సచివాలయం పరిధిలో 215 టోకెన్లు నమోదయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా జగనన్న సురక్షలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటేశ్వరరావు, డీటీ శ్రీనివాసరావు, సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ నవులూరి వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో పి.సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యద ర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు తీరు, స్వమిత్ర అన్‌లైన్‌లో నమోదు పురోగతి తదితర వాటిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 11 గ్రామసచివాలయాలు ఉండగా ఇప్పటి వరకు కనమర్లపూడి, వేల్పూరు-1, వేల్పూరు-2 గ్రామసచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు, అన్నీ శాఖల అధికారులు వలంటీర్ల సమన్వయంతో పనిచేయటం వలన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. అలాగే మిగిలిన గ్రామసచివాలయాల్లోని వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు వర్తించేలా క్షేత్రస్థాయిలో సర్వే చేసి అన్‌లైన్‌లో సమగ్ర వివరాలను నమోదు చేయించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. ఈనెలఖరు వరకు ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ఈవోపీఆర్డీ పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.



పెదకంచర్ల గ్రామసభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బొమ్మరాజుపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

మాస్టారు... మీ సేవలు మరువం

- బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంకు గురువులు, విద్యార్థులు సన్మానం
- పాఠశాల నిర్వహణకు ఏడేళ్ల కాలంలో రూ.5 లక్షల సొంత నిధులు వెచ్చింపు



హెచ్ఎం అజరయ్య దంపతుల్ని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు గేరా అజరయ్యను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఏడేళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి.. పాఠశాల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న నేపథ్యంలో బుధవారం వీడ్కోలు సభను నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు ఇన్‌చార్జ్ హెచ్ఎం కొలిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎం చైర్మన్ రాంబాబు, గ్రామ పంచాయతీ సర్పంచ్ దంటూ సరళ, ఎంపీటీసీ శ్రీరామమూర్తి, శ్రీఅనంతలక్ష్మి నూలుమిల్లు ఈడీ సామినేని ఫణిబాబు, సామినేని నాగేశ్వరరావు, చిలకలూరిపేట రోటరీక్లబ్ ప్రతినిధి గళ్లా సాంబశివరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 2015 నవంబర్ 4న ఉన్నవ హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన అజరయ్య 2023 జూన్ 8వ తేదీ వరకు ఉన్నవ హైస్కూల్ హెచ్ఎంగా అంకిత భావంతో ఎంతో సమర్థవంతంగా విధుల్ని నిర్వర్తించారన్నారు. ప్రస్తుతం ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా బదిలీపై వెళ్లారని, ఉన్నవ హైస్కూల్ హెచ్ఎంగా కొనసాగిన సమయంలో రోటరీక్లబ్ సాయంతో బాల, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, కరోనా ముందు వరకు ఏటా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థుల్ని ట్రిపుల్ ఐటీకి ఎంపిక చేసేందుకు కృషి చేశారన్నారు. అలాగే అనంతలక్ష్మి నూలుమిల్లు యాజమాన్యం ద్వారా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఉన్నవ.డాట్.కామ్ సంస్థద్వారా పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు, పుస్తకాలు పంపిణీ, క్రీడా, సంస్కృతి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ గావించి నగదు బహుమతుల్ని వచ్చేలా చేశారన్నారు. అన్నింటికీ మించి పాఠశాల నిర్వహణకు అయ్యే ఖర్చుల్ని తన ఏడేళ్ల కాలంలో సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి విద్యార్థుల భవితవ్యం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అజరయ్య అని కొనియాడారు. సహనంతో.. సమన్వయంతో.. అందరికీ సహకారం అందిస్తూ పాఠశాల ప్రగతి కోసం పాటుపడిన ఆయన అటు విద్యార్థుల్లోనూ, ఇటు ఉపాధ్యాయుల్లోనూ మంచి స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అనంతరం గేరా అజరయ్య, అజిత దంపతుల్ని వేదికపై అతిథులు, గురువులు, విద్యార్థులు ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మాన పత్రాన్ని చదివి సమర్పించి తమ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, మారుతీ, ప్రవీణ, వీరేశ్వరరావు, సుభాని, పీడీ మాధురిరాణీ పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- ఆ ఘనత ముఖ్యమంత్రి జగనన్నదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- విఠంరాజుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామంలో రెండో రోజు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుతో కలసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమదే అన్నారు. పేదరికం వల్ల చదువులు ఆగిపోకూడదని అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామసచివాలయాలు, రైతులు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పెదకంచర్ల గ్రామానికి నూతన సీసీ రోడ్డు నిర్మించామని, అలాగే గ్రామంలో మౌలిక వసతులు కూడా కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు గ్రామాల్లో ప్రభుత్వ అధికారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతున్నట్లు చెప్పారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందనివారిని గుర్తించి పథకాలు అందించడమే గడపగడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నారని, రానున్న రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, ఉపసర్పంచ్ పి.రామిరెడ్డి, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామ తులసిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్టైనోమ్, అయ్యప్పరెడ్డిలతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గురులింగం మాస్టారు



ఉపాధ్యాయులు గురులింగంను సన్మానిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

నాదెండ్ల: సమాజాన్ని నిర్మించటంలో గురువు పాత్ర ఉన్నతమైనదని, ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆదర్శప్రాయుడు గురులింగం మాస్టారని హెచ్ఎం ఏవీ సత్యనారాయణ చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన అవనిగడ్డ గురులింగం ఇటీవల నరసరావుపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రస్తుతం హెచ్ఎంగా సత్యనారాయణ మాట్లాడుతూ, గురులింగం మాస్టారు 1990లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారని, పలు పాఠశాలల్లో పనిచేసి గణపవరంలో ఎనిమిదేళ్ళపాటు సేవలందించారన్నారు. వందల మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పారన్నారు. తనతల్లి దండ్రులైన అవనిగడ్డ యల్లమందయ్య, హుస్సేనమ్మ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పలు పాఠశాలల్లో విద్యా సామగ్రి పంపిణీ చేశారన్నారు. రావూరి భరద్వాజ విజ్ఞాన పీఠం ప్రధాన కార్యదర్శిగా, జనవిజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ ట్రెజరర్‌గా విశిష్ట సేవలందించారన్నారు. ఉపాధ్యాయులు మేరి సుజాత, నాగమల్లేశ్వరి, రమాదేవి, జరుగుల ప్రసాద్, సునీత రత్నకుమారి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాషా, జేవీవీ అధ్యక్షుడు దారా బుచ్చిబాబు, స్థానిక నాయకులు బొంతా బాబు, జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో ధ్యాన మందిరం



ఈపూరు: ధాన్యం వల్ల మనిషికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ప్రతిరోజూ పిరమిడ్ లోపల ధ్యానం చేస్తే సకల రోగాలు పోతాయని 107 సంవత్సరాల బాబా సదానంద గిరి స్వామి అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో బుధవారం అహం బ్రహ్మస్మి పిరమిడ్ ధ్యానమందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పాళ్ల ప్రజలు ధ్యానానికి అలవాటు పడాలని సూచించారు. ప్రతిరోజూ ధ్యానం చేస్తే మనిషి అనేక రుగ్మతలకు దూరమై ఆరోగ్యంగా ఉంటారని, ధ్యానం మీద ధ్యాస ఉంచి చేసినట్లయితే ఎంతో మంచిదన్నారు. వెలగపూడి లక్ష్మణరావు, రామాంజనేయరెడ్డి, చంద్రకాంత్, శివ, పల్లా హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో వీరభద్రాచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల మస్టర్‌ను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో రూ.250లు వచ్చే విధంగా 3 గంటలు ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు సింగయ్య, సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బొల్లాపల్లి: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రోటరీ క్లబ్, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యార్థినులకు 200 సైకిళ్లు బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ అసిస్ట్ గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమని, గత ప్రభుత్వాల హయాంలో పూర్తికాని పనులను చేపట్టి అభివృద్ధికి నాంది పలికిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం హయాంలో స్వచ్ఛంద సంస్థలకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పని అంతగా లేదని, ప్రభుత్వమే నాడు-నేడులో పాఠశాలల బిల్డింగ్‌లు, అంగన్‌వాడీ కార్యాలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందు నాయక్, తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన కాలువల పరిశీలన



రావిపాడు సమీపంలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

నరసరావుపేట రూరల్: మండలంలో అక్రమణకు గురవుతున్న ఎన్ఎస్‌పీ కాలువలను అధికారులు పరిశీలించారు. రావిపాడు, ములకలూరు గ్రామాల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎన్ఎస్‌పీ కాలువలు అక్రమిస్తున్నారని స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు కాలువలను పరిశీలించారు. ఆర్డీఓ శేషిరెడ్డి, పొడా వైస్ చైర్మన్ డాక్టర్ గజ్జల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్, ఎన్ఎస్‌పీ అధికారులు పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ఎస్‌పీ, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సర్వే జరిపి నివేదికను కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు పంపుతామని తహసీల్దార్ రమణానాయక్ తెలిపారు.

సారూ... బైపాస్‌లో గోడలు కట్టకుండా చూడరూ...



కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీలను కలిసి విజ్ఞప్తి చేస్తున్న రైతులు

నరసరావుపేట: చిలకలూరిపేట మండలం బొప్పూడి, మురికిపూడి గ్రామాల్లోని బైపాస్ రోడ్డు పక్క భూములకు నిర్మాణ సంస్థ పక్కా గోడలు నిర్మాణం చేయకుండా చూడాలని రైతులు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లను కోరారు. బుధవారం ఆయా గ్రామాలకు చెందిన రైతులు కలెక్టరేట్‌లో దిశ సమావేశంలో పాల్గొన్న వీరిని కలిసి విన్నవించారు. పక్కా గోడల నిర్మాణం వలన రోడ్డుపక్క వ్యవసాయ భూములకు బాటలేక, రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివలన వ్యవసాయ భూములు సేద్యం గాక పాడుబడే పరిస్థితి ఉందన్నారు. కావున రోడ్డు నిర్మాణ అధికారులు రైతుల అనుమతి పొందే వరకు గోడ నిర్మాణం ఆపివేయాలని కోరారు. ఈ సమస్యపై కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మంగళవారం రోజు హైవే అధికారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బొప్పూడి మాజీ సర్పంచ్ పూసల హరి బాబు, రైతులు బంధంనేని శ్రీనివాసరావు, గోపాలం నాగేశ్వరరావు, చింతనిప్పుల రమణమూర్తి, గుంటు వెంకట సుబ్బారావు, నాగుబోలు వీరస్వామి, శ్యామసుందర్ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య



అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు హబ్ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు పోషకాహారం బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఎం. సరోజినీ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో విద్యను నేర్పడం జరుగుతుందని తెలిపారు. పీపీ-1, పీపీ-2 బోధన ఉంటుందని, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణను సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.